
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 17 డిసెంబరు 2024

సోలార్ రూఫ్‌టాప్‌లు వినియోగించుకోండి

అరసవల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ యోజన పథకం కింద రాయితీపై అందజేస్తున్న సోలార్ రూఫ్‌టాప్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. ఈ పథకం కింద తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు అందిస్తామన్నారు. సోమవారం జడ్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జీటిరోడ్డులోని విద్యుత్ భవన్ కార్యాలయం వద్ద మంగళవారం సోలార్ వినియోగం, ఉపయోగాలపై అవగాహన కల్పిస్తామన్నారు. రూఫ్‌టాప్ ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ కూడా చేస్తామని, గృహ విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



రేటింగ్‌లో వెనుకబడి

సంస్కరణల పేరిట జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసం పాఠశాలలను దీనస్థితిలోకి నెట్టేసింది. చదువులను గాలికొదిలి టోఫెల్, బైజూస్, సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్ సిలబస్ అంటూ చేసిన ప్రయోగాలు విద్యా ప్రమాణాలను దెబ్బతీశాయి. ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు అప్పగించడంతో పిల్లల చదువులు అటకెక్కాయి. 'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలల స్వరూపమే మార్చేస్తామని ప్రగల్బాలు పలికినా.. ఆ పనులు అసంపూర్తిగా వదిలేశారు. చాలాచోట్ల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం.. కలెక్టర్ల సదస్సులో వెల్లడించిన నివేదికలో ఈ వాస్తవాలు వెలుగుచూశాయి. ఈ నివేదిక ప్రకారం జిల్లాలోని ఒక్కపాఠశాలకూ ఫైవ్‌స్టార్ రేటింగ్ దక్కకపోవడం శోచనీయమని విద్యావేత్తలు అసంతృప్తి చెందుతున్నారు.

- జిల్లాలో ఒక్క ప్రభుత్వ పాఠశాలకూ దక్కని '5 స్టార్'
- ఆరు బడులకు సున్నా ఫలితమే
- వైసీపీ పాలనలో దెబ్బతిన్న విద్యాప్రమాణాలు
- కలెక్టర్ల సదస్సులో నివేదిక వెల్లడించిన కూటమి ప్రభుత్వం

శ్రీకాకుళం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు దెబ్బతిన్నాయి. గత ఐదేళ్లలో ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్లు వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రచారం చేసుకుంది. 'నాడు-నేడు'తో బడి స్వరూపాన్ని మార్చేశామని గొప్పలు చెప్పుకుంది. కాగా.. వాస్తవ పరిస్థితి పరిశీలిస్తే.. జిల్లాలోని చాలా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేవు. అభ్యసన ఫలితాలు బాగోలేవు. మౌలిక సదుపాయాలు, ఫలితాల్లో అత్యుత్తమంగా నిలిచిన పాఠశాల రాష్ట్రంలో ఒక్కటీ లేదు. కూటమి ప్రభుత్వం తాజాగా చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెలుగు చూసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ బడుల స్థితిగతులను తెలుసుకునేందుకు మౌలిక సదుపాయాలు, అభ్యసన ఫలితాల (లెర్నింగ్ అవుట్‌కమ్స్)కు ప్రభుత్వం స్టార్ రేటింగ్‌ను (మిగతా 6వ పేజీలో..)

జిల్లాలో పాఠశాలలకు లభించిన రేటింగ్స్

స్టార్ రేటింగ్	మౌలిక సదుపాయాలు	అభ్యసన ఫలితాలు
జీరో స్టార్	2	4
ఒక్క స్టార్	214	599
టూ స్టార్	1,333	1620
త్రీ స్టార్	913	410
ఫోర్ స్టార్	176	5
ఫైవ్ స్టార్	0	0
మొత్తం	2,638	2638

ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ పర్యటన

- ప్రజా సంఘాల నుంచి వినతుల స్వీకరణ
- ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం: విశ్రాంత ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా

శ్రీకాకుళం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ సోమవారం జిల్లాలో పర్యటించింది. విశ్రాంత ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ శ్రీకాకుళం చేరుకుంది. ఇందులో భాగంగా ముందుగా జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో అధికారులతోనూ, అలాగే కలెక్టరేట్‌లోనూ 'ఎస్సీ ఉపకులాల వర్గీకరణ'కు సంబంధించిన అంశంపై సమీక్ష నిర్వహించింది. అనంతరం షెడ్యూల్ కులాల ప్రతినిధులు, ప్రజలు, ఉద్యోగ సంఘాలు, కుల సంఘాల నాయకుల నుంచి కమిషన్ చైర్మన్ వినతులు స్వీకరించారు. విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక రంగాలలో ఆయా ఉప కులాల ప్రాతినిధ్యంపై చర్చించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి.. దాదాపు 59 షెడ్యూల్ ఉప కులాల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ప్రతి అంశాన్ని రికార్డుల్లో పొందుపరిచారు. ఈ సందర్భంగా ఏకసభ్య కమిషన్ విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ... అందరి అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామని తెలిపారు. ఇంకా ఏమైనా వినతులు ఉంటే.. విజయవాడలోని గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'ఏకసభ్య కమిషన్'లో అందజేయవచ్చన్నారు. "ఓఎంసీఎస్‌సీఎస్‌యాబీసీక్లాసిఫికేషన్ యట్‌దారేటాఫ్ జీమెయిల్.కామ్'2 అనే ఈమెయిల్‌కు వినతులను వచ్చే జనవరి 9లోగా పంపాలని స్పష్టం చేశారు.

- కుల సంఘాలు.. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. పంజాబ్, తమిళనాడులో ఎస్సీ వర్గీకరణ అమలుతోపాటు హర్యానా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్సీ జనాభా గణనకు 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలని కొందరు కోరారు. పూర్తిగా కొత్తగా కులగణన నిర్వహించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని మరి కొందరు విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణ, కులాల పునర్విభజనపై వచ్చిన ఫిర్యాదులు, వినతులను పూర్తిగా చర్చించి సమగ్ర అంశాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వమోహనరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, సోషల్ వెల్ఫేర్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ మిశ్రా, పక్కన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



న్యాయం చేయాలంటూ ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధిత విద్యార్థినీ, విద్యార్థులు

బెదిరించి.. హింసించాడు

- ఆడపిల్లలని కూడా చూడకుండా చితకబాదాడు
- సీసీ కెమెరాల వీడియోలు చూపించి వేధింపులు
- ఉద్యోగాల పేరుతో రూ.లక్షలు వసూలు
- ఎస్పీని ఆశ్రయించిన విద్యార్థినీ విద్యార్థులు

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'ఆర్మీలో కాంట్రాక్ట్ ఉన్నాయన్నాడు. శిక్షణ పూర్తయ్యాక పరీక్ష పాసైతే నేరుగా ఉద్యోగమేనని నమ్మించాడు. రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేశాడు. తీరా ఉద్యోగం అడిగితే.. హాస్టల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన అభ్యంతకర వీడియోలు చూపించి బెదిరించాడు' అని ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ నిర్వాహకుడు, శిక్షకుడు బీవీ రమణపై పలువురు బాధిత విద్యార్థులు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. తమకు పెళ్లి నిశ్చయమైందని, డబ్బులు అవసరం లేదని, కనీసం స్కూల్, కాలేజీ సర్టిఫికెట్లు ఇచ్చేస్తే వెళ్లిపోతామని బతిమిలాడినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా అడిగినందుకు ఆడపిల్లలని కూడా చూడకుండా ఆఫీసురూమ్‌లో, ఓ బ్లడ్‌బ్యాంక్ కార్యాలయంపైన చితకబాదాడని, తమకు న్యాయం చేయాలని సుమారు 30మంది విద్యార్థినీ విద్యార్థులు ఎస్పీని 'మీకోసం' వేదికలో కోరారు. వారి వివరాల మేరకు..

- విశాఖపట్నానికి చెందిన ఓ యువతి 2023 ఆగస్టు 28న ఇండియన్ ఆర్మీ కాలింగ్ సెంటర్‌లో చేరింది. బీవీ రమణ తనపై ఒపీనియన్ తెలపాలని పదేపదే ఒత్తిడి తెచ్చేవాడని, పరీక్ష పాసైతే రూ.2లక్షలు కడితే నేరుగా ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడని, సెలవుల్లో ఇంటికి వెళ్లినప్పుడు స్నేహితులతో బీచ్‌కు వెళ్లి సెల్‌లో ఫొటోలను తీసుకున్నానని, తిరిగి కాలింగ్ సెంటర్‌కు వచ్చినప్పుడు బీచ్‌కు ఎందుకు వెళ్లావంటూ మూడు రోజుల పాటు కేబుల్ వైర్‌తో (మిగతా 6వ పేజీలో..)

టీడీపీ నేత హత్యకు సుపారీ!

- 11 మంది బీహార్ ముఠా సభ్యులు రంగంలోకి..
- టెక్కలి, పలాస ప్రాంతాల్లో మకాం
- పోలీసుల అదుపులో ముఠా సభ్యులు?
- ఒక మాజీ ఆర్మీజవాను, ఒప్పంద లెక్చరర్ పాత్ర
- వారిద్దరూ వైసీపీ నేతలు కావడంతో మాజీమంత్రి సీదిరి అప్పలరాజు, అనుచరుల డ్రామా
- ఘటనపై పోలీసుల రహస్య విచారణ



పలాస పట్టణ టీడీపీ అధ్యక్షుడు బడ్డ నాగరాజు

పలాస, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పలాసలో ఓ టీడీపీ నేత హత్య కోసం బీహార్ గ్యాంగ్‌కు సుపారీ ఇవ్వడం కలకలం రేపుతోంది. వైసీపీ పాలనలో టీడీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులు చేశారు. అమాయకుల భూములపై లిటిగేషన్లు పెట్టి మధ్యవర్తిత్వం వహించి భారీగా డబ్బులు గుంజారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి.. అప్పనంగా అమ్మేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారి ఆగడాలు సాగడం లేదు. దీంతో బీహార్ రాష్ట్రానికి చెందిన గ్యాంగ్‌ను రంగంలోకి దించి.. టీడీపీ పట్టణ అధ్యక్షుడ్ని అంతమొందించేందుకు పథకం వేశారు. ఆ ప్లాన్ బెడిసికొట్టి.. టెక్కలి పోలీసులకు బీహార్ గ్యాంగ్ దొరకడంతో వాస్తవాలు బయటపడ్డాయి. వారిచ్చిన సమాచారం మేరకు ఇద్దరి వైసీపీ నాయకులు పోలీసులు రహస్యంగా విచారిస్తున్నట్టు సమాచారం. కాగా తమ పార్టీ వాళ్లను పోలీసులు, టీడీపీ నాయకులు కిడ్నాప్ చేశారంటూ మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం రాత్రి కాశీబుగ్గ పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేయడం చర్చనీయాంశంగా మారింది.

పోలీస్‌స్టేషన్ వద్ద హైడ్రామా!

చిన్నబడాం గ్రామానికి చెందిన కూర్మాపు ధర్మారావు, వరదరాజపురానికి చెందిన అంపోలు శ్రీనును పోలీసులు కిడ్నాప్ చేశారంటూ మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి ఆందోళన చేపట్టారు. పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముందుగా డీఎస్పీ కార్యాలయంలో కూడా గలాటా చేయడంతో పోలీసులు అక్కడి నుంచి పంపించేశారు.

అసలు ఏమైందంటే..

- పలాసలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు బడ్డ నాగరాజు ఫైర్‌బ్రాండ్‌గా ఎదిగారు. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకుల అక్రమాలపై ఎదురొడ్డి పోరాడారు. గతంలో ఓ లాడ్జిలో సేదతీరుతున్న నాగరాజు, ఆయన అనుచరులపై ఓ డీఎస్పీ, ఆయన అంతరక్షకులు, వైసీపీ నాయకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆయన ఇల్లు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని, వంశధార కాలువ ఆక్రమించి రోడ్డు వేశారంటా అప్పట్లో అర్ధరాత్రి వేళ పోలీసులతో వీరంగం సృష్టించారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు, అప్పటి టీడీపీ రాష్ట్రకార్యదర్శిగా వ్యవహరించిన ప్రస్తుత ఎమ్మెల్యే గౌతు శిరీష, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ వంటివారు ఆ రాత్రివేళ నాగరాజుకు సంఘీభావం చెప్పడంతో పాటు అరెస్టయ్యారు కూడా. అయినా ఆయనపై వైసీపీ నాయకులకు పగ చల్లారలేదు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ఆగడాలు, సోషల్‌మీడియా వ్యవహారంపై పోలీసులకు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంలో నాగరాజు ముందు ఉండేవారు. దీనికి తోడు వైసీపీ నేతల రియల్‌ఎస్టేట్ వ్యవహారంపై కూడా అనేక ఫిర్యాదులు చేస్తు అక్రమాలు అడ్డుకున్నారు. అన్నింటికీ నాగరాజే అడ్డని వైసీపీ నాయకులు భావించారు. చిన్నబడాంలో నివాసం ఉంటున్న ఆయన్ను టార్గెట్ చేసి.. ఏకంగా అంతమొందించడానికి పథక రచన చేశారు. ఆ గ్రామంలో ఉండే రిటైర్డ్ ఆర్మీ జవాను, మందస మండలం వరదరాజపురం గ్రామానికి చెందిన వైసీపీ నేత (ఈయన ప్రస్తుతం పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒప్పంద అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు) కలిసి నాగరాజును హతమార్చేందుకు కుట్ర పన్నినట్లు పోలీసులు మొదటి నుంచి అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల టెక్కలిలో బీహార్ రాష్ట్రానికి చెందిన 11మంది అనుమానస్పదంగా పోలీసులకు కనిపించారు. వారిని ప్రశ్నించడంతో అసలు స్కెచ్ బయట పడింది.
- బీహారీ ముఠా కొద్దిరోజుల కిందట పలాస వచ్చినట్లు సమాచారం. వీరు కోసంగిపురం, టెక్కలి ప్రాంతాల్లో ఇళ్ల అద్దెకు తీసుకొని ఎవరికి అనుమానం రాకుండా మసలుతున్నారు. వీరికి రూ.10లక్షలకు పైగా సుపారీ ఇచ్చి నాగరాజును హతమార్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోలీసులకు తెలిసింది. వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా మారణాయుధాలు లభించినట్లు తెలుస్తోంది. వారిని విచారించగా (మిగతా 6వ పేజీలో..)

ఎస్పీ, ఏఎస్పీ విచారణ

టెక్కలి పోలీస్‌స్టేషన్‌కు ఆదివారం అర్ధరాత్రి వేళ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ(క్రైమ్) పి.శ్రీనివాసరావు హుటాహుటిన చేరుకున్నారు. మొత్తం పోలీసులు బీహార్‌గ్యాంగ్‌ను విచారిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారాన్ని పోలీసులు ఇంకా ధ్రువీకరించలేదు. అయితే వైసీపీ నాయకులు, బీహారీ సుపారీ ముఠా తమ ఆధీనంలోనే ఉందని చెప్పకనే చెబుతున్నారు. గత పలాసను మళ్లీ వైసీపీ నాయకులు తీసుకువచ్చే యోచనలో ఉన్నారని సాక్షాత్తు ఓ పోలీసు ఉన్నతాధికారి వ్యాఖ్యానించడం గమనార్హం.

యూట్యూబ్‌లో ప్రశ్నపత్రాలు

- సోమవారం పరీక్షలు రద్దు చేసిన అధికారులు

6లో

మహిళ దారుణ హత్య

- నిందితుడి పరారీ..

ఇచ్ఛాపురంలో సాధువును కడతేర్చారు

ఉపాధ్యాయునిపై ఆగంతకుడి దాడి

8లో

విదేశీ బయ్యర్లు.. ఎక్కడ?

- 'చైనా'కు వీసా సమస్యలు..
- 'యూరప్'కు ఉక్రెయిన్ వార్ ప్రభావం
- నిలిచిన గ్రానైట్ బ్లాకుల ఎగుమతులు



టెక్కలిలో గ్రానైట్ బ్లాక్‌లు

టెక్కలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నీలిరంగు గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. విదేశాలకు వెళ్లే 40శాతం గ్రానైట్ మోర్నమెంట్ బ్లాకుల ఎగుమతి నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆఫ్‌లైన్ పర్మిట్లు ఆన్‌లైన్‌లోకి మారడానికి నాలుగు నెలల సమయం పట్టింది. ఇది తేరుకున్నాక మోర్నమెంట్ బ్లాకులు ఎగుమతికి విదేశీ బయ్యర్లు ముఖం చాటేశారు. యూరప్ దేశాలైన ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్, పోలెండ్, స్పెయిన్, అలాగే ఆసియా నుంచి చైనా తదితర దేశాల నుంచి విదేశీ బయ్యర్లు నేరుగా ఈ ప్రాంతానికి వచ్చి నీలిరంగు గ్రానైట్ క్వారీల్లో బ్లాకులను పరిశీలించేవారు. రెండు క్యూబిక్‌మీటర్ల సైజు మొదలుకొని పది క్యూబిక్ మీటర్ల సైజు వరకు గల బ్లాకులను కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం చైనా బయ్యర్లకు వీసా సమస్యలు తలెత్తగా, యూరప్ దేశాలకు చెందిన బయ్యర్లకు ఉక్రెయిన్ యుద్ధం ప్రభావం, ఆర్థికమాంద్యం, క్రిస్మస్ దగ్గర పడడం తదితర కారణాలతో 90శాతం విదేశీ బయ్యర్లు మోర్నమెంట్ బ్లాకులు కొనుగోలు చేయడం లేదు. విశాఖ పోర్టుకు బ్లాకులు రవాణా చేసే ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు సైతం పక్కకు చేరాయి. దీంతో చేసేది లేక కొందరు క్వారీ యజమానులు ధర తగ్గించి మరీ కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్లకు బ్లాకులు విక్రయిస్తున్నారు. మోర్నమెంట్ బ్లాక్ ఒక క్యూబిక్ మీటరు రూ.30వేల నుంచి రూ.40వేలు ఉండగా.. కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్‌కు రూ.25 వేలు లోపే అమ్ముతున్నారు. క్వారీల్లో నిర్వహణ భారం, మిషనరీ ఖర్చులు, అద్దెలు తడిపిమోపెడు కావడంతో కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్లకు చౌకగా విక్రయించక తప్పడం లేదని యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఏటా క్రిస్మస్ ముందు ఈ పరిస్థితి దారుణంగా ఉంటుందని వాపోతున్నాయి. చైనా, యూరప్ దేశాల విదేశీ బయ్యర్లు తిరిగి గ్రానైట్ పరిశ్రమలోకి అడుగుపెడితే తప్ప నీలిరంగు గ్రానైట్ పరిశ్రమ తేరుకునే పరిస్థితి కనిపించడం లేదని చెబుతున్నాయి.

రేషన్ డీలరు.. సర్పంచ్

- వైసీపీ నాయకురాలి ద్విపాత్రాభినయం
- 20 ఏళ్లుగా డీలర్‌గానూ కొనసాగుతున్నవైనం
- షోకాజ్ నోటీసు జారీ



గొండెల సుజాత

టెక్కలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీకి చెందిన వైసీపీ నాయకురాలు గొండేల సుజాత నిబంధనలకు విరుద్ధంగా రెండు చోట్ల ప్రభుత్వ లబ్ధి పొందుతున్నారు. ఆమె ఓవైపు సర్పంచ్‌గా, మరోవైపు ఎనిమిదో వార్డు రాజావీధి ప్రాంతంలో చౌకధరల దుకాణం(127100 నెంబరు) డిపో డీలర్‌గా వ్యవహరిస్తున్నారు. 20 ఏళ్లుగా ఆమె డీలరుగా పని చేస్తున్నారు. 2021 ఫిబ్రవరి 29న టెక్కలి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇన్నాళ్లు ఈ విషయాన్ని గుర్తించని అధికారులు.. తాజాగా ఆమెకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి సుజాతను పిలిచి సర్పంచ్‌గా వ్యవహరిస్తారా?, డీలర్‌గా ఉంటారా? ఏదో ఒకటి తేల్చుకోవాలని స్పష్టం చేశారు. దీంతో తాను సర్పంచ్‌గా టెక్కలిలోని పలు ప్రాంతాల్లో సీసీరోడ్లు, కాలువలు నిర్మించానని, వాటికి సంబంధించిన బిల్లులు రావాల్సి ఉన్నందున సమయం కావాలని ఆమె ఆర్డీవోను కోరారు. అయితే ఈ విషయం బయటకు పొక్కడంతో సుజాత ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అవసరమైతే సర్పంచ్ పదవికి రాజీనామా చేసి.. డీలర్ పోస్టులో కొనసాగేందుకు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. కాగా.. సర్పంచ్‌గా ఆమె తీసుకున్న గౌరవవేతనమా? లేదా డీలర్‌గా ప్రభుత్వం నుంచి పొందే కమీషన్‌ను రికవరీ చేయాలా? అని అధికారులు ఆలోచిస్తున్నారు.

- ఈ విషయమై ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి వద్ద ప్రస్తావించగా ఇప్పటికే సర్పంచ్‌గా, డీలర్‌గా వ్యవహరిస్తున్న సుజాత నుంచి వివరాలు తీసుకున్నామని తెలిపారు. ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేశామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామని అన్నారు.

ఒకే దేవుడు.. విభిన్న రూపాలుగా..

- పలాసపురంలో కపిలేశ్వరుడినే విష్ణువు, బ్రహ్మగా కొలిచే ఆచారం
- ప్రత్యేకత చాటుతున్న కపిలేశ్వర విరంచి నారాయణస్వామి దేవాలయం
- ధనుర్మాస పూజలు ప్రారంభం



కపిలేశ్వర విరించి నారాయణ స్వామి

సోంపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏ దేవాలయంలోనైన తాము విశ్వసించే ఆ భగవంతుడిని ఒక్క రూపంలో ప్రతిష్ఠించి, పూజలు జరపడం సాధారణ విషయం. కానీ మండలంలోని పలాసపురంలో వెలసిన ప్రాచీన కపిలేశ్వర విరంచి నారాయణస్వామి దేవాలయంలో శివుడినే వేర్వేరు సమయాల్లో వేర్వేరు రూపాలుగా కొలిచే ఆచారం కొనసాగడం ఇక్కడ ప్రత్యేకత. ఇక్కడి దేవుడిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచే కాక పక్క రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వస్తుంటారు. ధనుర్మాసం సందర్భంగా బ్రహ్మగా పూజలందుకునేందుకు ఇక్కడి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో మూడు రూపాల్లో పూజలందుకుంటున్న ఇక్కడి కపిలేశ్వర విరంచి నారాయణస్వామి దేవాలయంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

పలాసపురంలో వెలసిన కపిలేశ్వర విరంచి నారాయణ స్వామి దేవాలయం అతి ప్రాచీనమైనది. సాధారణంగా శివుని దేవాలయాల్లో కార్తీకమాసంలో ప్రత్యేక పూజలు జరుపుతుంటారు. కానీ ఇక్కడ కార్తీకమాసంలో శివుడి రూపంలో పూజలు జరుపుతారు. అదే పుష్యమాసంలో అయితే విష్ణువుగా పూజిస్తారు. ధనుర్మాసం వస్తే బ్రహ్మగా కొలుస్తారు. ఇలా ఒకే దేవుడిని, వేర్వేరు రూపాలలో కొలవడం ఇంకెక్కడా లేదని, ఇదే ఈ కపిలేశ్వర విరంచి నారాయణస్వామి దేవాలయం ప్రత్యేకతగా ఇక్కడి భక్తులు చెబుతుంటారు. ఇక్కడి ఆలాయాన్ని దేవుళ్లే నిర్మించారని స్థానికులు నమ్ముతారు. ఈ దేవాలయంలో శివుడికి కపిలేశ్వరుడిగా పిలవడానికి సైతం ప్రత్యేక కారణం ఉందంటారు. దీనిపై స్థల పురాణం సైతం ఉంది.

స్థల పురాణం ఇదీ..

ఈ ప్రాంతానికి సమీపంలో ఉన్న మహేంద్ర గిరులపై పాండవులు అజ్ఞాతవాసం గడిపేందుకు వచ్చారని, ఆ సమయంలో వారు అడవిలో సంచరిస్తూ తమకు కావలసిన ఆహార పదార్థాలను సేకరించుకునేవారని చెబుతారు. అలా వారు ఆ మహేంద్ర గిరులపై సంచరిస్తున్న సమయంలో అనుకోకుండా వారు కపిల అనే గోవును సంహరించారు. ఆ గోవు చెవులు ఇక్కడికి సమీపంలోని మహదేవిపురంలో పడ్డాయని, అక్కడ గోకర్ణేశ్వరుడిగా శివుడు వెలసాడని చెబుతారు. అలాగే ఆవు పొట్ట పొత్తంగిలో పడటంతో అక్కడ శివుడు పొత్తేశ్వరుడుగా వెలశాడని, ఆ గోవును చంపినపుడు పడిన రక్తపు చుక్కలు ఒకటి తక్కువ కోటి బారువలో పడటంతో అక్కడ కోటిలింగేశ్వరుడుగా పూజలందుకుంటున్నారనేది స్థానికుల మాట. ఇక గోవు కపాలం పలాసపురంలో పడిందని, అందుకే ఇక్కడి శివుడిని కపిలేశ్వరుడుగా పిలుస్తారని స్థల పురాణం ఉంది. ఈ దేవాలయాన్ని సాక్షాత్తూ ఆ దేవతలే నిర్మించారని చెబుతారు. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ప్రతి రూపాలుగా ఈ దేవాలయంలో మూడు లింగాలు ఉన్నాయి. ఆయా మాసాల్లో విశిష్టతను బట్టి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండటం ఆచారంగా వస్తోంది. పురాణాలలో సైతం ఈ దేవాలయం ప్రశస్తి ఉందని భక్తులు చెబుతుంటారు.



కపిలేశ్వర స్వామి దేవాలయం



పూజల కోసం చీపుర్లు, గొడుగుతో భక్తులు

పూజా విధానమూ ప్రత్యేకమే..

మామూలుగా శివుడికి విభూతి, బిల్వపత్రాలను అభిషేకిస్తారు. కానీ ఇక్కడ భక్తులు విభూదిపండ్లతో పాటు ప్రత్యేక రోజుల్లో పుష్య మాసంలో మహిళలు చీపుర్లను కానుకగా అందజేస్తారు. అలాగే తెల్ల ఆవాలు, చోళ్ల ప్రసాదంగా నెయ్యి ముద్దలనే కాకుండా బూడిద గుమ్మడి కాయలను ఇవ్వడం ఇక్కడి ప్రత్యేకత. వృద్ధులు, చిన్నపిల్లలతో ఈ బూడిద గుమ్మడి కాయలను దానంగా ఇప్పిస్తారు. ఇలా చేస్తే ఒంట్లో ఎటువంటి రోగాలు ఉన్నా నయవుతాయనేదిని భక్తుల విశ్వాసం. ఆలయాన్ని దర్శించిన భక్తులు ఆవాలను గుడిచుట్టు చల్లడం ఆచారంగా వస్తోంది. ఇలా చల్లితే, ఆ దేవుడి దయవల్ల తమ ఇంటికి ఎటువంటి చెడుగాలి సోకదని భక్తుల నమ్మకం. అలాగే లింగానికి అభిషేకించే గంధాన్ని ధనుర్మాసంలో తీస్తారు. అన్ని మట్టిగా భావించి, భక్తులు తీసుకుంటారు. దీన్ని పూసుకుంటే చర్మవ్యాధులు నయవుతాయని వారి నమ్మకం. శరీరంలో సోబి (చర్మవ్యాధి) ఉంటే ఈ దేవాలయాన్ని సందర్శించి ఆలయం చుట్టూ తెల్ల ఆవాలు చల్లితే వ్యాధి తగ్గిపోతుందనేది వారి విశ్వాసం. దీంతో పరిసర గ్రామాల నుంచే కాకుండా ఒడిశా, పశ్చిమ బెంగాల్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఇక్కడి స్వామిని దర్శించుకుంటుంటారు.

ధనుర్మాస వేడుకలు ఆరంభం

- ఆలయాల్లో పూజలు.. గ్రామాల్లో మేలుకొలుపులు

నరసన్నపేట, డిసెంబరు 16: గ్రామాల్లో నెలరోజులు పాటు సందడిగా నిర్వహించే ధనుర్మాస వేడుకలు ఆరంభమయ్యాయి. శ్రీరామ, విష్ణు ఆలయాలతోపాటు నరసన్నపేట పట్టణంలో వేంకటేశ్వ స్వామి, గీతామందిరంలో ఈ వేడుకలు సోమవారం ఉదయం ప్రారంభించారు. గీతా మందిరంలో గోదా రంగనాథ స్వాములకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. రాజీవ్‌నగర్, పురుషోత్తనగర్‌లో శ్రీరామనామ పుష్పార్చన పురోహితులు వనమాలి ప్రదీప్‌కుమార్ శర్మ చేపట్టారు. ఇక గ్రామాల్లో హరికథ సంకీర్తనలు, మేలుకొలుపుల భజనలు మొదలయ్యాయి. సత్యవర అగ్రహారంలో రుత్వికులు నెలగంటు పెట్టారు. అనంతరం నారాయణవలస అభయ అంజనేయస్వామి భజన బృందం భజనలు చేశారు.



సత్యవరం గ్రామంలో మేలుకొలుపు చేపట్టిన నారాయణ వలస భజన బృంద సభ్యులు

శ్రీకూర్మక్షేత్రంలో..

గార, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం క్షేత్రంలో సోమవారం ఉదయం ధనుర్మాస ఉత్సవం ప్రారంభ మైంది. సుప్రభాత సేవ, బేడసేవ అనంతరం మంత్ర పుష్పం సమర్పించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు, శ్రీ భాశ్యం పద్మనాభ ఆచార్యులు, శ్రీనివాసాచార్యులు, కిషోర్‌బాబు, ఆలయ ఈవో జి.గురునాథరావు పాల్గొన్నారు.



బేడాసేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్యామసుందర స్వామికి కిరణస్పర్శ

టెక్కలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): టెక్కలి-తొలుసూరుపల్లి రోడ్డులోని శ్యామసుందరస్వామి ఆల యంలో స్వామి వారి విగ్రహానికి సోమవారం సూర్యకిరణాలు తాకాయి. ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా అర్చకుడు పద్మనాభ పండా పూజలు చేస్తుండగా స్వామికి కిరణాలు తాకడంతో భక్తులు తిలకించి ఆనందం పొందారు.



స్వామివారి పాదాలను తాకుతున్న సూర్యకిరణాలు



శ్రీముఖలింగేశ్వరుని ఆలయంలో..

జలుమూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వర స్వామి ఆలయంలో విష్ణుమూర్తి సన్నిధిలో ధనుర్మాస పూజలను సోమవారం ప్రారంభించారు. ఈ పూజలు జనవరి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం తెలిపారు. నెలగంటు పెట్టిన నాటి నుంచి భోగి వరకు మహా విష్ణువునకు ప్రతిరోజు వేకువజామున ధనుర్మాస పూజలు నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

← ధనుర్మాసం సందర్భంగా అలంకరణలో విష్ణుమూర్తి



గంటను ఊరేగిస్తున్న భక్తులు

ఆ గంటను నెల రోజులు ఎవరూ కొట్టరు

ఇచ్ఛాపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి, పెద్ద జగన్నాథస్వామి, సత్యన్నారాయణ స్వామి ఆలయాల్లో సోమవారం వేకువ జామునుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గిలాయివీధిలో కొలువుదీరిన వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలతో పాటు తులసిమాలలతో స్వామివారికి అలంకరించి పూజలు చేశారు. కొత్త గంటతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం దాన్ని ఆలయంలో కట్టారు. ఈ గంట మాసం రోజులు పాటు ఎవరూ కొట్టరని అర్చకులు తెలిపారు. దీన్నే నెలగంట అంటారని చెప్పారు. ధనుర్మాసంలో విష్ణుమూర్తిని మధుసూదన పేరిట పూజిస్తారు. ఈ నెలలో తొలి పక్షం రోజులు పాటు చక్కెర పొంగళి లేదా పులగం నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ తర్వాత పక్షం రోజులు దద్దోజనం నైవేద్యంగా ఇస్తారు.

మీకోసం అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మీకోసంలో వచ్చే అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఆయన ఫిర్యాదుదారుల నుంచి 49 అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలపై కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జడ్పీ సీఈవో శ్రీధరరాజు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఉద్యానవన అధికారి ప్రసాదరావు, డీపీవో కె.భారతి సౌజన్య, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, బీసీ సంక్షేమాధికారి అనూరాధ, డీఎస్‌వో సూర్యప్రకాష్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డ్వామా పీడీ సుధారకరరావు, డీసీహెచ్‌ఎస్ కళ్యాణబాబు తదితరులు పాల్గొన్నారు.




అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పుండ్కర్ →

యూట్యూబ్‌లో ప్రశ్నపత్రాలు

- సోమవారం పరీక్షలు రద్దు చేసిన అధికారులు
- పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు ఉంచాలని ఆదేశం
- లీక్‌చేసిన వారిపై చర్యలు తీసుకోని వైనం

పొందూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్‌ఏ-1 లెక్కల ప్రశ్నపత్రం లీక్ కావడంతో పరీక్షను రద్దుచేసి తిరిగి నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. అయితే లీక్ చేసినవారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తిరిగి కొత్త ప్రశ్నపత్రం రూపొందించి పరీక్ష నిర్వహించడం ద్వారా ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతోంది. ఎస్‌ఏ-1 పరీక్షల్లో భాగంగా సోమవారం ఉదయం నిర్వహించాల్సిన నిర్వహించాల్సిన 6,8,10 తరగతుల లెక్కలు ప్రశ్నపత్రం ఉదయమే యూట్యూబ్‌లో లీక్ అయింది. అయితే పాఠశాలల్లో ఉదయం యథావిధిగా 6,8,10 తరగతులకు లెక్కల పరీక్షలు నిర్వహించారు. పూర్తయిన తరువాత లీక్ అయిన విషయం తెలుసుకుని పరీక్షను రద్దు చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. మధ్యాహ్నం జరగాల్సిన 7,9 తరగతుల పరీక్షలను రద్దు చేశారు. దీంతో జిల్లాలో 743 ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులపై ప్రభావం పడింది. 6,8,10 తరగతుల ప్రశ్నపత్రాలను సోమవారమే మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో భద్రపరచాలని డీఈవోలను, ఎంఈవోలను, హెచ్‌ఎంలను విద్యాశాఖ కమిషనర్ సోమవారం వీడియో కాన్ఫరెన్సులో ఆదేశించారు. ప్రతీరోజు పోలీస్‌స్టేషన్ నుంచి తీసుకుని వెళ్లాలి. పరీక్షలు రద్దు చేసి మళ్లీ నిర్వహించడం, ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్ నుంచి తీసుకువెళ్లడంపై ఉపాధ్యాయ సంఘాలు ఖండిస్తున్నాయి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. పాఠశాల సమయం పూర్తయిన తరువాత రాత్రిసమయంలో మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయాలకు అందించడం ఎంత ఇబ్బందో ఆలోచించాలని కోరుతున్నారు.

- విద్యాశాఖ ఉన్నతాధికారుల నిర్ణయం పాటించాల్సిందేనని, ఈమేరకు పాఠశాలల హెచ్‌ఎంలకు, యాజమాన్యాలకు తెలియజేశామని పొందూరు ఎంఈవో-1 రాజేంద్రప్రదేశ్ తెలిపారు.
- ఈ పరీక్షలు రద్దుచేసి తిరిగి నిర్వహించడం వల్ల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ఇబ్బందిగా ఉంటుందని, యూట్యూబ్‌లో లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న డిమాండ్ చేశారు.



సోమవారం ఉదయం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ప్రజా ఫిర్యాదులు పరిష్కరించాలి

- ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారులను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక మీకోసంలో 62 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబందిత పోలీసు అధికారులకు సూచనలు చేశారు. ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

బెదిరించి.. హింసించాడు

(ఐదో పేజీ తరువాయి)

చితకబాదాడని ఆ యువతి ఫిర్యాదు చేసింది. అది చాలక న్యూబ్లడ్‌బ్యాంక్ పైఅంతస్తులో కూడా రమణ తనను కొట్టాడని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది.

- ఆగురు గ్రామానికి చెందిన యువతి 2022లో ఇండియన్ ఆర్మీ కాలింగ్ సెంటర్‌లో చేరింది. ఉద్యోగం కావాలంటే రూ3.50లక్షలు కట్టాలని చెప్పడంతో నాన్నమ్మ చనిపోయినా తన తల్లిదండ్రులు రమణకు సుధీర్, శ్రీకాంత్ సమక్షంలో డబ్బులు ఇచ్చామని ఆ యువతి ఎస్పీకి ఫిర్యాదు చేసింది. తన డబ్బుల కోసం అడిగితే సీసీ కెమెరాలో రికార్డు అయిన అభ్యంతరకర వీడియోలను చూపి బెదిరించాడని, తనకు న్యాయం చేయాలని ఆమె ఎస్పీని కోరింది.
- మరి కొంతమంది విద్యార్థులు సైతం ఆర్మీలో ఉద్యోగం కోసమని రూ.లక్షల్లో డబ్బులు ఇచ్చామని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- విశ్రాంత ఆర్మీ ఉద్యోగి రవిరాజా మాట్లాడుతూ విలేకరులతో మాట్లాడుతూ రమణ నెలకొల్పిన సంస్థలో తాను కొంతమందిని చేర్పించానని, వారిని రమణ మోసం చేశాడని, గతంలో ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా అప్పటి ఎస్ఐ రాజీప్రయత్నం చేశారని ఆరోపించారు. బాధితులకు మాజీ సైనికుల జేఏసీ నాయకులు, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు.

శ్రీకాంత్ పాత్రపై అనుమానాలు

ఇండియన్ ఆర్మీకాలింగ్ సంస్థలో ఏవోగా పని చేసిన శ్రీకాంత్ తీరు పట్ల పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో బీవీ రమణ అరెస్టు తర్వాత విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఇటీవల ఓ సమావేశం ఏర్పాటు చేసి పిల్లలను ఇంటికి తీసుకువెళ్లిపోవాలని చెప్పినట్లు తెలుస్తోంది. అయితే సోమవారం పెద్ద ఎత్తున బాధితులు ఎస్పీకి రమణతో పాటు శ్రీకాంత్, సుధీర్‌పై ఫిర్యాదు చేయనున్నట్లు తెలుసుకుని.. శ్రీకాంత్ తాను ఏవో పదవికి రాజీనామా చేస్తున్నానని, విద్యార్థులతో కలిసి రమణ బాగోతాన్ని ఎస్పీ కార్యాలయంలో బయటపెడతానని నమ్మించాడు. ఇదిలా ఉండగా రమణ వాడిన కారును రూరల్ పోలీసులు కొద్ది రోజుల క్రితం శ్రీకాంత్ ద్వారా స్టేషన్‌కు తరలించారు. అయితే ఎప్పుడు తెమ్మంటే అప్పుడు స్టేషన్‌లో అప్పగించాలని పోలీసులు చెప్పి కారును విడిచి పెట్టారు. ఇప్పుడు పోలీసులు కారును తీసుకుని రావాలని శ్రీకాంత్‌ను కోరగా.. ఆ రోజు నుంచి తప్పించుకుని తిరుగుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

టీడీపీ నేత హత్యకు సుపారీ!

(ఐదో పేజీ తరువాయి)

చిన్నబడాం, వరదరాజుపరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుల వ్యవహారం బయటకు వచ్చింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వీరిద్దర్ని క్రైమ్ పోలీసులు విచారణకు తీసుకెళ్లినట్లు సమాచారం.

- ఇదిలా ఉండగా పలాస నియోజకవర్గంలో సుపారీ గ్యాంగ్ హల్‌చల్‌తో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. ఎన్నడూ లేని విధంగా రాజకీయాల్లో గ్యాంగ్‌వార్‌లకు తెరలేపడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారానికి పాల్పడింది ఎవరు, వెనుక నుంచి చేయిస్తుంది ఎవరో? అన్న ప్రశ్నలు తలెత్తుతుతున్నాయి. దీనిపై పోలీసులు దర్యాప్తు చేసి.. పాత్రదారులు, సూత్రధారులను వెలికి తీయాల్సి ఉంది. ఈ వ్యవహారంపై కాశీబుగ్గ సీఐ డి.మోహనరావు వద్ద ప్రస్తావించగా.. బీహార్ గ్యాంగ్ ముఠా జిల్లాలో ఓ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొరికిందని, ఇంకా పూర్తి సమాచారం రాలేదని, తొందరలోనే మొత్తం సమాచారం మీడియాకు అందిస్తామన్నారు.

రేటింగ్‌లో వెనుక'బడి'

(ఐదో పేజీ తరువాయి)

ప్రకటించింది. ఇటీవల కలెక్టర్ల సదస్సులో ఈ నివేదిక వెల్లడించింది. ఈ నివేదికలో జిల్లాలోని ఒక్కపాఠశాలకూ ఫైవ్‌స్టార్ రేటింగ్ రాకపోకవడం.. విద్యాప్రమాణాలు దెబ్బతిన్నాయనడానికి నిదర్శనంగా నిలుస్తోంది.

- జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 2,638 ఉన్నాయి. వీటిలో ఏ ఒక్కటి కూడా కనీసం ఒక విభాగంలోనూ ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేకపోయాయి. 176 పాఠశాలల్లో మాత్రమే మౌలిక సదుపాయాలు ఫరవాలేదన్నట్టుగా ఉన్నాయి. అభ్యసన ఫలితాలు మాత్రం దిగజారిపోయాయి. ఈ విభాగంలో ఐదు పాఠశాలలకు మాత్రమే నాలుగు స్టార్లు లభించాయి. అత్యధిక పాఠశాలలు ఒకటి, రెండు, మూడు స్టార్లతోనే సరిపెట్టుకున్నాయి. మరోవైపు సదుపాయాల్లో 2, అభ్యసన ఫలితాల్లో 4 బడులకు జీరో రేటింగ్(అసలు రేటింగే దక్కని స్థితి) రావడం మరింత దౌర్భాగ్యం. ఈ నివేదికతో వైసీపీ ప్రభుత్వం చేసిన ప్రచారం అంతా ఉత్తిదేనని తేలిపోయింది.

మొత్తం 18 అంశాలను ప్రామాణికంగా..

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల విభాగంలో రేటింగ్ కోసం 18 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. బడిలో మరుగుదొడ్లు, ల్యాబ్‌లు, క్రీడా మైదానం, ప్రహరీ, గ్రంథాలయం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ తరగతి గదులు, తాగునీరు తదితరాలను పరిశీలించారు. ఒక్కో అంశానికి 5 చొప్పున గ్రేడింగ్ ఇచ్చారు. వీటిలో 90శాతం గ్రేడింగ్ సాధించిన బడులకు 5 స్టార్లు కేటాయించారు. 30 కంటే తక్కువ ఉంటే ఒక స్టార్ ఇచ్చారు. అభ్యసన ఫలితాల విభాగంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, గతేడాది పదోతరగతి పరీక్షల ఫలితాలు, ఇటీవల జరిగిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను, ఒకవేళ పదో తరగతి లేకపోతే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను ప్రామాణికంగా తీసుకున్నారు. ఈ నాలుగు విభాగాల్లో హాజరుకు 40శాతం, ఫలితాలకు 60 శాతం గ్రేడింగ్ ఇచ్చారు. రెండూ కలిపి 90 శాతం దాటిన బడులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. అంతకంటే తక్కువ ఫలితాలున్న బడులకు 1 నుంచి 4 స్టార్లు కేటాయించారు.

ఫలితాల్లేని సదుపాయాలెందుకు..?

వైసీపీ ప్రభుత్వం బడులను రాజకీయ ప్రచారానికి వాడుకుంది. విద్యార్థుల హాజరు, వారి పరీక్షల ఫలితాలను గాలికొదిలేసింది. 'నాడు-నేడు' పేరుతో బడులకు రంగులు, కుర్చీలు, బెంచీలు అంటూ బోధనను నిర్లక్ష్యం చేసింది. టీచర్లకు నాడు-నేడు పనులు, మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతలు అప్పగించి బోధన సమయాన్ని తగ్గించింది. దీనిపై అప్పట్లో ఉపాధ్యాయులు గగ్గోలు పెట్టారు. కానీ జగన్ ప్రభుత్వం వారి ఆందోళనలను పెడచెవిన పెట్టింది. పాఠశాల విద్య అంటే 'నాడు-నేడు' పథకం ఒక్కటేనన్నట్టుగా మార్చేసి, ఫలితాలను దిగజార్చిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

సాగు నీరందించి ఆదుకోండి

● కలెక్టర్‌కు తోటవాడ గ్రామస్థుల వినతి ● 'మీకోసం'లో వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతుల వెల్లువ



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతుల వెల్లువెత్తాయి. సాగునీటిసమస్యలు పరిష్కరించాలని, పింఛన్లు ఇప్పించాలని, విధుల్లో చేర్చుకోవాలని పలువురు కోరారు.

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తమ భూములకు సాగునీరందించి ఆదుకోవాలని బూర్జ మండలంలోని తోటవాడ గ్రామానికి చెందిన రైతులు 40 మంది రైతులు కోరారు. ఈమేరకు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంశధార, నాగావళికి అనుసంధానంగా ఇచ్చిన పిల్లకాలువ తమ భూముల మధ్యలో నుంచి వెళతోందని తెలిపారు.దీంతో తమ భూములకు ఎటువంటి ప్రయోజనం లేదని, అనుసంధానంగా ఉన్న కాలువ నుంచి నీటిని తమ భూములకు అందజేస్తే తిమడాం, అయ్యవారిపేట, అన్నపేటగ్రామాలకు చెందిన సుమారు 5000 ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని చెప్పారు. తమ గ్రామానికి చెందిన కూర్మసాగరం నుంచి నీరు బట్టి ద్వారా రామభద్రరాజుపేట చెరువుకు వెళ్లిపోతోందని, ఈ బట్టి ద్వారా వెళ్లే నీటిని ఆపితే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

కుమారుడిని రక్షించుకునేందుకు..

మృత్యువుతో పోరాడుతున్న తమ కుమారుడు బొట్ట చరణ్‌ను రక్షించుకోవడానికి సహకరించాలని శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దపాడుకు చెందిన అప్పారావు, లక్ష్మి దంపతులు కోరారు. మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. శతశాతం అంగవైకల్యం, బుద్ధిమాంద్యంతోపాటు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. ప్రతీ నెల రూ.15వేలను అందించి తమను ఆదుకోవాలని కోరారు.

విధుల్లోకి తీసుకుని ఆదుకోండి

తనను విధుల్లోకి తీసుకుని ఆదుకోవాలని పాలకొండ మండలంలోని జి.మంగళాపురానికి చెందిన కోరాడ ఫణిధర్ కోరాడు. మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశాడు. పంచాయతీ సెక్రటరీగా 2003 నుంచి ఉద్యోగం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఆయన రెండు కాళ్లు, చేతులు పోగొట్టుకున్నట్లు తెలిపాడు. ఆ విషాదం నుంచి కోలుకుగా మళ్లీఉద్యోగంలో చేరడానికి కార్యాలయాలచుట్టూ తిరుగుతున్నట్లు చెప్పాడు.

పింఛన్ ఇప్పించండి

తమ కుమార్తె రీనాకు దివ్యాంగ పింఛను ఇప్పించి ఆదుకోవాలని మెళియాపుట్టి మండలంలోని హీరాపురం గ్రామానికి చెందిన డి.సత్యం, కస్తూరి దంపతులు సోమవారం మీకోసంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించి వేడుకున్నారు. ఇంట్లో కుమార్తెను చేసుకునేందుకు తన భార్య కూడా ఇళ్లు కదలలేని పరిస్థితి నెలకొందని సత్యం వాపోయాడు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి

●నగరపాలకసంస్థ హెల్త్ ఆఫీసర్ సుధీర్‌కుమార్



మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధానికి వ్యాపారులు సహకరించాలని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ సుధీర్‌కుమార్ కోరారు. సోమవారం నగరపాలక సంస్థలోని తన కార్యాలయంలో టీ దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లకు బదులుగా పేపర్ కప్స్ లేదా గాజు, స్టీల్ గ్లాసులు వినియోగించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నివారణలో భాగస్వాములు కాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చేపల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ



శిక్షణ నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

ఆమదాలవలస, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):చేపలు, రొయ్యలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే మంచి ధర లభిస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో చేపలు, రొయ్యలు పెట్టుబడి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణా నిర్వహించారు. కార్యక్రమంలో మత్స్యశాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.బాలకృష్ణ, కె.వీరాంజనేయులు, బి.కోటేశ్వరరావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలోని చర్చిల్లో క్రిస్మస్ సందడి



కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని చర్చిల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. ఈ సందర్భంగా డగ్లస్ స్కూల్‌లో జాయిల్ పాస్టర్ ఆధ్వర్యంలో చర్చిల నిర్వాహకులు కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కటింగ్ నిర్వహించారు. చర్చిలన్నీ విద్యుత్ అలంకరణతో అలంకరించారు. తెలుగు బాప్టిస్టు చర్చిలో క్రిస్టమస్ ట్రీ, క్రిస్టమస్ తాత ఏర్పాటుచేశారు. ఉమెన్స్ కాలేజీ రోడ్డులో ఆరాధన చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో లుడియా జాన్, జాన్సన్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ నిలిపివేయాలి

రణస్థలం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ నిలిపివేయాలని భీమ్ భవన్ కమిటీ అధ్యక్షుడు దువ్వాన అప్పలసూరి డిమాండ్ చేశారు. సోమవారం రణస్థలంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి రామతీర్థం జంక్షన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు.వీరికి మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మద్దతు తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం సూపరింటెండెంట్ నారాయణమూర్తికి అందజేశారు. కార్యక్రమంలో దళితనాయకులు కృష్ణ, చింతు అప్పారావు పాల్గొన్నారు.

రాజ్యాంగ సవరణతోనే వర్గీకరణ జరగాలి

సోంపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్‌కులాల వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా జరగలేదని, కులగణన జరిగిన తరువాత రాజ్యాంగ సవరణ ద్వారానే జరగాలని జైభీమ్‌సేన ప్రతినిధులు కోరారు.ఈ మేరకు ఎస్సీ వర్గీకరణకు సంబందించిన ఏకసభ్య కమిషన్‌గా నియమితులైన రాజీవ్‌రంజన్ మిశ్రాకు శ్రీకాకుళంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జైభీమ్‌సేన ప్రధానకార్యదర్శి డొప్ప వెంకటరావు, అధ్యక్షుడు బుస్క ఈశ్వరరావు, చల్లా దేవరాజు, నూతనపాటి బాబూరావు పాల్గొన్నారు.

సఫాయ్ కర్మ చారిస్ కమిషన్ సభ్యుడి పర్యటన

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ సఫాయ్ కర్మచారిస్ కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా సోమవారం శ్రీకాకుళంలో పర్యటించారు. ఈ మేరకు ఆయన్ను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కలుసుకున్నారు.

జాడలో జ్యోతుల ఊరేగింపు



జి.సిగడాం:జ్యోతులతో తిరువీధి నిర్వహిస్తున్న భవానీ భక్తులు

జి.సిగడాం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాడలో భవానీ భక్తులు గురుస్వాములు జరజాన రాము, పోతులు భాగ్యరాజు ఆధ్వర్యంలో సోమవారం భక్తిశ్రద్ధలతో జ్యోతులను ఊరేగించారు. భవానీ మాలాధారణ చేసిన భక్తులు గ్రామంలో మంగళవాయిద్యాలు,మేళతాళాలతో జ్యోతులు కళ్లకుఅద్దుకుని మొక్కులు చెల్లించారు.

ఇచ్ఛాపురంలో ధన సంక్రమణం పూజలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ధన సంక్రమణం పూజలు ఘనంగా నిర్వహించారు. సోమవారం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, సింధూర మర్దన, సహస్రనామార్చనలు, హోమాలు జరిపించారు. ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. అలాగే గాంధీ పార్క్ ఎదురుగా ఉన్న ముత్యాలమ్మతల్లి, మండపల్లి గారపోలమ్మ తల్లి అమ్మవారి ఆలయాల్లో సంక్రమణం పూజలు నిర్వహించారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించండి

●బిజూ జనతాదళ్ రాష్ట్ర పరిశీలకుడు నీలమహదేవ



మాట్లాడుతున్న నీలమహాదేవ

పర్లాకిమిడి,డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వ నమోదుపై నేతలు, కార్యకర్తలు దృష్టి సారించాలని బిజూజనతాదళ్ (బీజేడీ) రాష్ట్ర పరిశీలకుడు నీలమహదేవ అన్నారు. పర్లాకిమిడిలో సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. బీజేడీ అధ్యక్షుడు, మాజీ సీఎం నవీన్ పట్నాయక్ తన పాలనలో చేపట్టిన పనులపై ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బిజూజనతాదళ్ అధ్యక్షుడు లింగరాజు, మున్సిపల్ చైర్మన్ నిలంశెట్టి, వైస్‌చైర్మన్ మధు, కౌన్సిలర్లు, సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇదీ సంగతి

పర్లాకిమిడిలో ధనుర్మాస పూజలు ప్రారంభం

పర్లాకి మిడి,డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వేకువ జామున నెలగంటు కార్యక్రమం నిర్వహించి ధనుర్మాసోత్సవాలు ప్రారంభించారు. అర్చకుడు భద్రం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో చేపట్టారు. తిరుప్పావై పాశుర విన్నపం, గోదాదేవికి పూజలు చేపట్టారు.

పండుగలా రామ్మోహన్‌నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించాలి: ఎమ్మెల్యే శంకర్



అరసవల్లి: కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జన్మదిన వేడుకలను పండుగలా నిర్వహించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక 80 అడుగుల రోడ్డులో గల కేంద్రమంత్రి నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బుధవారం ఉదయ ఎన్టీఆర్ మున్సిపల్ మైదానానికి చేరుకోవాలని కోరారు. ఐదు వేల మందితో మున్సిపల్ మైదానంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగానే కేంద్రమంత్రి జన్మదిన కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. కార్యక్రమంలో కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు, చౌదరి బాబ్జీ, అరవల రవీంద్ర, మాజీ ఎంపీపీ గొండు జగపతి, నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, కొర్ను నాగార్జున ప్రతాప్, విజయరాం, సింతు సుధాకర్, కొమ్మనాపల్లి వెంకటరామరాజు, విభూది సూరిబాబు, సూర రమణయ్య పాల్గొన్నారు.

మొదటి దశ పనులు పూర్తిచేయండి

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మొదటి దవలో మంజూరైన పనులను పూర్తి చేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని రాగోలులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధులతో కాలువలు, రోడ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. రోడ్లు కావాలని కోరిన వెంటనే కలెక్టర్ ప్రతిపాదనలతో వెంటనే మంజురు చేస్తున్నట్లు తెలిపారు.గతంలో మంజూరైన అభివృద్ధి పనులు తాను నిలుపుదల చేయాలేదని, గతంలో నిర్మించి బిల్లులు రాక ఇబ్బంది పడుతున్న వారు అధైర్యపడవద్దని చెప్పారు. పనులు చేసిన ప్రతి ఒక్కరికి బిల్లులు మంజూరుకు తాను జవాబు దారీగా ఉంటానని తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు గాయత్రి ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ మహిళా జట్టుకు జిల్లా నుంచి క్రీడాకారిణి గాయత్రి ఎంపికైనట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోత పూర్ణచంద్రరావు, పీవీజీ కృష్ణంరాజులు తెలిపారు. మహారాష్ట్రలోని రాయఘడ్‌లో ఈనెల 25 నుంచి జరగనున్న పోటీల్లో ఆమె పాల్గొనుంది. ఈ మేరకు గాయత్రిని ఆ సంఘం చైర్మన్ సూర శ్రీనివాసరావు, కోశాధికారి బీహెచ్ అరుణ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.అజయ్‌కుమార్, శిక్షకులు తారకేశ్వరరావు, ఎం.మధుసూదనరావు అభినందించారు.

జీతాలు, పెన్షన్ జమచేయాలి

నందిగాం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు, పెన్షన్‌ను వెంటనే జమచేయాలని ఆ సంస్థ పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు తమిరె వైకుంఠరావు ఒక ప్రకటనలో కోరారు. నవంబరు ముగిసి పక్షం రోజులైనా ఇంత వరకు బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమ కాలే దన్నారు. దీంతో అద్దెలు, వైద్య సేవలకు ఇబ్బందులు పడుతు న్నామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

టెక్కలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలని సీఐ అంబటి విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం అంజనాపురంలో సంక ల్పంలో భాగంగా గ్రామస్థులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఎవరైనా అపరిచిత వ్యక్తు లు కనిపిస్తే తెలియజేయాలని కోరారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం: ఎన్ఈఆర్



ఎచ్చెర్ల: నీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

ఎచ్చెర్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలందిం చేందుకు చర్యలు తీసుకుంటామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని చెప్పారు. నడుకుదిటివానిపాలెంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో సోమవారం జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తితో కలిసి ఎస్ఎంపురం- 1, 2 నీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. కార్యక్రమంలో ఎస్ఎంపురం-1, 2 నీటి సంఘాల అధ్యక్షులు సంపతిరావు గణపతిరావు, పేడాడ చిట్టిబాబు, బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ సంపతిరావు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు చౌదరి అవినాష్, పొందూరు భీమారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొంటి నర్సింగరావు పాల్గొన్నారు.

● రణస్థలం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో ఉన్న రెవెన్యూ సమస్యలపై ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో రెవెన్యూఅధికారులతో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సమీక్షించారు. మంగళవారం విశాఖపట్నం రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్ రానుండడంతో రెవెన్యూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకె ళ్తున్నట్లు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావ తెలిపారు. ●ఎన్‌జీఆర్ పురంలో జరిగిన భూ వివాదంలో గాయపడిన కూటమి మత్స్యకార నాయకులు శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతుండడంతో నడుకుదిటి ఈశ్వరరావు పరామర్శించారు.ఈయనతో కూటమి నాయకులు ముప్పిడి సురేష్, పిన్నింటి భానూజినాయుడు ఉన్నారు.

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

గుజరాతీపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):కవిటి మండలంలోని బుర్రపుట్టుగ సమీపంలోఉపాధ్యాయిని బల్లెడ భారతిపై జరిగిన దాడిని ఏపీటీఎఫ్ జిలా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్వీ.అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో ఖండించారు. నిందితున్ని పట్టుకుని వెంటనే అరెస్ట్ చేసి, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ

పొందూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటిపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సంస్థ బాసటగా నిలిచింది. కట్టుబట్టలతో నిలిచిన బాధిత కుటుంబాలకు రూ.50 వేలు విలువచేసే వంటసామగ్రి, దుస్తులు, బియ్యం, కంబళ్ళు అందించారు. కార్యక్రమంలో యంగ్‌స్టార్స్ అధ్యక్షుడు, రెడ్‌క్రాస్ మండల కన్వీనర్ కె.శాంతారాం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎం. రమణ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఎ. వినయ్‌కుమార్, చైతన్య, పవన్, గోపి పాల్గొన్నారు

పాఠశాలకు మోటారు..

కంచిలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌సీపురం పాఠశాలకు కంచిలికి చెందిన వ్యాపారి కిల్లశెట్టి మోహన్‌రావు నీరు సరఫరాకు మోటారు వితరణగా అందజేశారు. ఇటీవల జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమం నిర్వహించిన సమయంలో విద్యార్థులు మోటారు లేక ఇబ్బందిపడుతున్న విషయాన్ని గుర్తించారు. దీంతో సోమ వారం మోటార్ కొనుగోలు చేయడానికి, ప్లంబింగ్ వర్క్‌కు సంబందించి రూ20వేలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ముకుందరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

పొందూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 16 : మండలంలోని మలకాం ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతూ అనారోగ్యానికి గురైన ఆరో తరగతి విద్యార్థి అదపాక దేవీవర ప్రసాద్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.25 వేలు అందజేశారు. ఇటీవల సైకిల్ తొక్కుతూ కింద పడిపోవడంతో దేవీవరప్రసాద్ గాయపడడంతో శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. దీంతో రూ.25 వేలు సేకరించి విద్యార్థి కుటుంబానికి సోమవారం అందించారు.

యూహెచ్‌సీ వైద్యాధికారిగా జోషిత

ఇచ్ఛాపురం, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యాధికారిగా ఎ.జోషిత బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు కౌన్సిలర్లు సుగ్గు ప్రేంకుమార్, చాట్ల పుష్ప తిరుపతిలు, గ్రామ పెద్దలు ఆమెను అభినందించారు.

నేటి నుంచి ఆధార్ డ్రైవ్

ఇచ్ఛాపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం నుంచి ఆధార్ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి 20వ తేదీ వరకు, 26 నుంచి 28 వరకు డ్రైవ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సోమ, మంగళవారాల్లో బెల్లుపడ కాలనీ-2లో, 19, 20 తేదీల్లో స్వేచ్ఛావతి టెంపుల్ సెంటర్, 26న నాయుడువీధి సెంటర్, గొల్లవీధి సెంటర్‌లో 27న, పురుషోత్తపురం సెంటర్‌లో 28న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరేళ్లలోపు పిల్లలు, ఆధార్ కార్డు లేనివారు అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రవీణ్ నాయక్ నివాళి

ఎచ్చెర్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఐటీలో ఇటీవల మృతిచెందిన విద్యార్థి ప్రవీణ్ నాయక్‌కు నివాళులర్పించారు. సోమవారం క్యాంపస్ ఆవరణలో సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో మునిరామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి పాల్గొన్నారు.

160 మందికి వైద్యసేవలు

లావేరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెజ్జిపురంలో స్థానిక యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళ కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో సోమవారం గుండె వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 160 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు, కార్యదర్శి అప్పారావు, కోశాధికారి గంట్యాడ అప్పలనాయుడు, ఏవో రామారావు పాల్గొన్నారు.

కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

కవిటి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): కవిటి మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్.మన్మథరావు, గౌరవాధ్యక్షుడిగా జి.వీరభద్రస్వామి, ఉపాధ్యక్షురాలిగా పి.జ్యోతిలక్ష్మి, ప్రధానకార్యదర్శిగా ఆర్.చంద్రశేఖర్, కోశాధికారిగా అబ్దుల్‌ఖాన్, సలహాదారుగా ఎం.మోహనరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.హరికృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వి.రూపతో పాటు మరో ఐదుగురును ఎన్నుకున్నారు. ఈవోపీఆర్డీ శివాజీపాణిగ్రాహి సమక్షంలో ఈఎన్నికను నిర్వహించారు.

కార్యదర్శుల సంఘం అధ్యక్షురాలిగా శాంతికుమారి

సోంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సోంపేట మండల పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం సోమవారం ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షురాలిగా ఎం.శాంతికుమారి, ఉపాధ్యక్షుడిగా పి.ప్రవీణ్, కార్యదర్శిగా ఎ.వరలక్ష్మి, కోశాధికారిగా బి.శ్రీనివాసరావును ఎన్నుకున్నారు.

సుస్థిరాభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి

●సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



రణస్థలం: మాట్లాడుతున్న సీఈవో సత్యంనారాయణ

పంచాయతీల అభివృద్ధికి సుస్థిరాభివృద్ధి ప్రణాళికను సమష్టిగా రూపొందించాలని పలువురు పంచాయతీరాజ్ అధికారులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయాల్లో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మంత్రి త్వశాఖ సౌజన్యంతో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీల పాలనపై ప్రజాప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పనిచేస్తే సుస్థిరాభివృద్ధి సాధ్యమని చెప్పారు. (ఆంధ్రజ్యోతి బృందం)

రంగస్థల నటుడికి సత్కారం

పలాసరూరల్,డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): భారతీయ సాంస్కృతిక సహకార స్నేహసంఘం (ఇస్కా ఫ్) ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఆదివారం రాత్రి జరిగిన కళా ఉత్సవాల్లో పలాసకు చెందిన టీవీ, సినీ, రంగస్థల నటుడు కుమార్‌నాయక్‌కు సత్కరించారు. కళారంగంలో సుమారు 45 ఏళ్లుగా కళా ప్రదర్శనలు చేస్తూ ఎంతో మంది కళాకారులను తయారు చేసినందుకు ఆయనన అభినందించినట్లు నిర్వా హకులు తెలిపారు. కార్యక్రమంలో ఇస్కాఫ్ సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శ బిజ య్ కుమార్ పడహరి, ఏపీ తెలుగుఫిలిమ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రాజు శ్రీనివాసరాజు, ఏపీ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్ కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

58 ఎకరాల్లో పోర్టు నిర్వాసిత కాలనీ

● పూర్తి సదుపాయాలతో ఏర్పాటుకు చర్యలు ● ఆర్డీవో కృష్ణమూర్తి


మాట్లాడుతున్న ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి

టెక్కలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు భూములు కేటాయించిన మూలపేట, విష్ణుచక్రం గ్రామస్థులకు నౌపడా మూడు రోడ్ల జంక్షన్ సమీపంలో 58 ఎకరాల్లో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పూర్తి సదుపాయాలతో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దీనికి సంబంధించిన విధి విధానాలను రూపొందించామని చెప్పారు. కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్యుద్దీపాలతో పాటు ఇతర సౌకర్యాలు కల్పనకు ఆయా శాఖల ద్వారా టెండర్లు పిలవనున్నట్లు పేర్కొన్నారు. జనవరి మొదటివారం నుంచి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాల పనులు కల్పించేలా చర్య లు తీసుకుంటామన్నారు. విష్ణుచక్రం గ్రామస్థులు పలే సమస్యలను తెలిపారని, వాటిని ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

ఇప్పటికే పోర్టు నిర్వాసిత గ్రామాల్లో 584 పీడీఎఫ్‌లు తొలివిడత పంపిణీ చేయగా, రెండో విడతలో 14 అర్జీలు వచ్చాయని, వాటిలో రెండు పీడీఎఫ్‌లు, 12 పీఏఎఫ్ (ప్రాజెక్ట్ ఎఫెక్టెడ్ ఫ్యామిలీ)లు, మూడో విడతగా 75 అర్జీలు పీడీఎఫ్‌ల కోసం వినతులు రాగా వాటిలో ముగ్గురికి అర్హత ఉన్నట్లు కిందిస్థాయి అధికారులు గుర్తించారన్నారు. వీటిపై చివరగా ఆర్డీవో స్థాయి అధికారి దర్యాప్తు పూర్తయిన వెంటనే బ్యాలెన్స్ పీడీఎఫ్, పీఏఎఫ్‌లు చెల్లిస్తామన్నారు. పోర్టు రైల్వే భూములకు సంబంధించి రూ.16 కోట్ల చెక్కులు రైతుల కోసం సిద్ధం చేశామని, సుమారు 200 మంది రైతులు తీసుకునేందుకు ముందుకు వచ్చారని, మరో 50 మందికి ఇంకా పెం డింగ్‌లో ఉన్నాయన్నారు. పోర్టుకు అవసరమైన అటవీ, సాల్ట్ భూముల వ్యవహారాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ప్రస్తావించారని, త్వరలో ఆ వ్యవహారం ఓ కొలిక్కి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

మహిళ దారుణ హత్య

జిల్లాలో ఆదివారం రాత్రి రెండు హత్యలు జరిగాయి. గాజుల కొల్లివలసలో మహిళ, లొద్దపుట్టి వద్ద సాధువును హత్య చేసిన ఘటనలు జిల్లా వాసులను కలవరానికి గురిచేశాయి..


పద్మ (ఫైల్)

ఆమదాలవలస, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజుల కొల్లి వలస దరిలో ఉన్న వంశధార నిర్వాసిత ఆర్‌ఆర్ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. నిర్వాసిత కాలనీకి చెందిన దామోదర పద్మ (35) కొంతకాలంగా తన ఇద్దరు కుమార్తెలతో కలిసి నివసిస్తోంది. భర్త దామోదర కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా గ్రామంలో చిన్న పాన్‌షాప్ నిర్వహిస్తూ కుమార్తెలను చదివిస్తూ జీవిస్తోంది. వారు ఇంటర్, పదో తరగతి చదువుతున్నారు. పద్మకు స్థానికంగా ఉండే ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడి కలిసి మెలిసి ఉండేవారు. ఆమె ఇటీవల వేరే వ్యక్తితో తరచుగా మాట్లాడడం చూసిన సదరు వ్యక్తి ఆమెపై కక్ష పెంచుకున్నాడు. భవానీ మాలధారణలో ఉన్న ఆ వ్యక్తి ఆదివారం రాత్రి పద్మ ఇంటికి వెళ్లి తలుపులు కొట్టగా తలుపులను ఆమె తీసింది. ఆ సమయంలో ఇరువురు ఘర్షణ పడ్డారు. తనతో తెచ్చుకున్న కత్తితో సదరు వ్యక్తి పద్మ ఛాతిపై పొడవగా అక్కడి కక్కడే మృతి చెందింది. ఆ సమయంలో నిద్రిస్తున్న ఇద్దరు పిల్లలు లేచి రక్తపు మడుగులో ఉన్న తల్లిని చూసి వెంటనే కేకలువేయడంతో నిందితుడు అక్కడ నుంచి పరారయ్యాడు. అక్కడకు చేరకున్న స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. అప్పటికే పద్మ మృతి చెందినట్టు గుర్తించారు. మృత దేహానికి శవ పంచనామా చేసి పోస్టు మార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు. ఈ ఘట నపై ఎస్‌ఐ కె.వెంకటేష్ కేసు నమోదు చేశారు. సీఐ పి.సత్యనారాయణ దర్యాప్తు నిర్వహిస్తున్నారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హత్య జరిగిన ఆర్‌ఆర్ కాలనీకి వెనుక వైపు ఉన్న సంగమేశ్వ రస్వామి కొండపై నిందితుడు ఉన్నట్టు అతని ఫోన్ ద్వారా పోలీసులు గుర్తించారు.డ్రోన్‌ను కొండపైకి ఎగురవేయగా ఆ చిత్రాల్లోనూ కనిపించినట్టు సమాచారం.

రెండు నెలల కిందటే నిందితుడిపై కేసు

ఆర్‌ఆర్ కాలనీకి చెందిన దామోదర పద్మ రెండు నెలల కిందటే పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తిపై ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఆర్థిక లావాదేవీల వల్ల పద్మ, ఆ వ్యక్తి మధ్య తగాదా జరగడంతో ఆమె ఆతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు స్థానికులు తెలిపారు. పోలీసులు ఇద్దరిని పిలిచి మందలించి పెద్దల సమక్షంలో రాజీ కుదిర్చినట్లు సమాచారం. అప్పట్లో తనను చంపుతానని అతడు బెదిరిస్తున్నాడని పోలీసుల వద్ద ఆమె మొరపెట్టుకున్నట్టు స్థానికులు, కుటుంబీకులు తెలిపారు.

ఇచ్ఛాపురంలో సాధువు..



ఇచ్ఛాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): లొద్దపుట్టి గ్రామ సమీపంలోని ధనరాజ తులసమ్మతల్లి అమ్మవారి ఆలయం వద్ద కాషాయి రంగు దుస్తులు ధరించి ఉన్న సాధువు హత్యకు గురయ్యాడు. పోలీ సుల కథనం మేరకు.. ఆలయం వద్ద చాలాకాలంగా సాధువు పట్ట స్వామి భిక్షాటన చేసుకుని జీవిస్తు న్నాడు. ఆదివారం రాత్రి ఆలయ సమీపంలోని ఓ దుకాణం వద్ద ఆతడు నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బండరాళ్లతో తలపై కొట్టి హత మార్చారు. సోమవారం విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి సీఐ మీసాల చిన్నమనాయుడు, పట్టణ ఎస్‌ఐ చిన్నమనాయుడు చేరుకుని మృత దేహాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. తెల్ల గెడ్డం, పట్టబుర్రతో ఉన్న సాధువు వయసు సుమారు 60 ఏళ్లు ఉంటుంది. మృతదేహాన్ని ఇచ్ఛాపురం ప్రభుత్వాసు పత్రికి తరలించి పీఎం రూములో భద్రపరిచారు. హత్యకేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. సాధువు కోసం ఎవరికైనా తెలిసినా తెలియజేయాలని సీఐ కోరారు.

క్రైం కార్నర్

సారవకోటలో రూ.1.40 లక్షలు అపహరణ

జలుమూరు, (సారవకోట) డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) సారవకోట ఏపీజీవీబీలో బ్యాంకు మిత్రగా పనిచేస్తున్న తంగుడు సురేష్ వద్ద నుంచి రూ.1.40 లక్షలు గుర్తు తెలియని వ్యక్తి సోమవారం తస్కరించాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బ్యాంకుమిత్ర సురేష్ సోమవారం యథావిధిగా బ్యాంకు ప్రక్కనే ఉన్న జిరాక్స్ షాపులో ఖాతాదారుల లావాదేవీలు చేసేందుకు వెళ్లి అక్కడ రూ.1.40 లక్షలు బ్యాగులో పెట్టి సమీపంలోని మెడికల్ షాపుకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వచ్చి బ్యాగును చూసేసరికి బ్యాగులో నగదు కనిపించకపోవడంతో లబోదిబోమన్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్ కుమార్ తెలిపారు. నగదు చోరీ చేసిన వ్యక్తి బ్యాంకు సీసీ పుటేజీలో రికార్డు అయినట్లు తెలిపారు. దొంగను త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉపాధ్యాయినిపై ఆగంతకుడి దాడి


బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రపుట్టుగలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయిని బి.భారతిపై ఆగంతకుడు దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కథనం మేరకు.. భైరిపురం గ్రామానికి చెందిన బి.భారతి ప్రతి రోజూ విధి నిర్వహణలో భాగంగా ద్విచక్ర వాహనంపై బొర్రపుట్టుగ వెళ్లేది. అయితే వారం రోజులుగా ఆమె నడుచుకొని వెళ్తోంది. ఈ క్రమంలో సోమవారం అదే దారిలో పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యంలోని కంకర రోడ్డులో అగంతకుడు తలపై దాడి చేశాడు. వెంటనే ఆమె బోర్లాపడిపోవడంతో మెడలో ఉన్న పుస్తెలతాడు తెంపాడు. అయితే ఆమె పెనుగులాడడంతో పుస్తెల తాడు జాకెట్టులోకి జారి పోయింది. వెంటనే ఆమె తలవెనుక భాగంలో రాయితో కొట్టాడు. చుట్టూ తోటలు ఉండడంతోపాటు ఆ సమయంలో జనసంచారం లేదు. కేకలు వేసుకుని భారతి తప్పించుకొని పాఠశాలకు వెళ్తుండగా మధ్యలో తోటకు వెళ్తున్న పి.తిరుపతిరావు అనే వ్యక్తి కలవడంతో ఆయన సాయంతో బొర్రపుట్టుగ గ్రామానికి చేరుకొంది. గాయపడిన భారతిని కవిటి ప్రభుత్వాసుపత్రికి చికిత్సకోసం తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైనవైద్యం కోసం పలాస తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ ఆసుపత్రికి చేరుకొని పరామర్శించారు. ఆయన ఎస్పీ మహేశ్వరరెడ్డిని ఫోన్‌లో సంప్రదించారు. ఉద్దానం ప్రాంతంలో ఇటీవల చైన్‌స్నాచర్స్ ఎక్కువగా దాడులకు పాల్పడుతున్నారని ఎస్పీకి వివరించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవివర్మ తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ఇచ్ఛాపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసును ఓ వ్యక్తి చోరీచేసిన సంఘటన ఇచ్ఛాపురంలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ ఇ.చిన్నమనాయుడు కథనం మేరకు.. బెల్లుపడ గ్రామానికి చెందిన లండ నీలవేణి తన కుమారైతో కలిసి స్కూటీపై సోమవారం ఉదయం కవిటి మండలంలోని రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే అశోక్‌ను కలవడానికి వెళ్తోంది. ఆ సమయంలో నీలవేణి వెనుక బైక్‌పై వస్తున్న గుర్తుతెలియని వ్యక్తి ఇచ్ఛాపురంలోని స్వైడ్రాప్ వాటర్ ప్లాంట్ జంక్షన్ దాటిన తర్వాత ఇటుకుల బట్టి వచ్చేసరికి ఈదుపురం ఎలా వెళ్లాలని ఆ మహిళకు అడిగాడు. ఆమె చెబుతుండగానే మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును తెంపుకొని పోయాడు. నీలవేణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీకాకుళంలో యువకుడి ఆత్మహత్య


శంకర్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఓ యువకుడు ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. శ్రీకాకుళంలోని లెప్రసీ కాలనీ సమీపంలో రామమందిరం వీధిలో నివసిస్తున్న పట్నాన శంకర్(23) కొంతకాలంగా ఓ మహిళను ప్రేమించి ఆమెతోనే ఉంటున్నాడు. సోమవారం ఉదయం ఆమె గిన్నెలు తోముతుండగా శంకర్ ఇంట్లో ఉరి వేసుకున్నాడు. పనులు ముగించుకుని ఇంట్లోకి వెళ్లి చేసే సరికి శంకర్ ఉరివేసుకుని ఉండడంతో చుట్టు పక్కల వారిని పిలిచి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శంకర్ మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయం ఒన్‌టౌన్ పోలీసులకు తెలియజేయడంతో ఎస్‌ఐ-2 బి.రామారావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతికి కారణాలు తెలియరాలేదు.

17 మద్యం సీసాల స్వాధీనం

కొత్తూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ ఎండీ అమీర్‌అలీ హెచ్చరించారు. నివగాం గ్రామంలో పలు దుకాణాల్లో సోమవారం దాడి చేశామన్నారు. సల్లాన హరిశ్చంద్ర వద్ద 17 మద్యం సీసాలుండగా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇతనిపై గతంలోనూ మద్యం కేసు ఉండడంతో రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

గుండెపోటుతో జూనియర్ వెటర్నరీ అధికారి మృతి



సింహాచలం (ఫైల్)

నందిగాం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నర్సిపురం పశు వైద్య కేంద్రం జూనియర్ వెటర్నరీ అధికారిగా డెప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న బసవల సింహాచలం ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈ స్వగ్రామం చిన్నల వునిపల్లి సింహాచలం అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. మృతునికి భార్య వనజాక్షి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సింహాచలం కుటుంబ సభ్యులను నందిగాం పశువైద్యశాఖ ఏడీ ఎం.రవికృష్ణ, పశువైద్యాధికారి ధర్మారావు పరామర్శించి సంతాపం తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

పాతపట్నం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సీది గ్రామ కూడలి సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాదచారుడిని తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. హిరమండలం మండలం ధనుపురం గ్రామానికి చెందిన మడ పటి కృష్ణారావు కొరసవాడ నుంచి నడుచుకుంటూ వెళుతుం డగా వెనుకనుండి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొని ఈ ప్రమాదం జరిగింది. దీంతో కృష్ణారావుకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానిక సీహెచ్‌సీకి తరలిం చగా డా.దేవీప్రసాద్ ప్రథమ చికిత్సచేసి మెరుగైన వైద్య సేవలకు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిర్మించి వదిలేశారు..



వజ్రపుకొత్తూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వైసీపీ ప్రభుత్వంలో ఆర్బీకే భవనాన్ని నిర్మించినా నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో సిబ్బంది పాత తుఫాన్ షెల్టర్‌లో విధులు నిర్వహిస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే ఆర్బీకే సేవల కోసం వచ్చే రైతు లు ఇక్కట్లకు గురవుతున్నారు. రూ.15 లక్షలతో నిర్మించిన భవనం వృథాగా వదిలేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

శానిటరీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంఈవో సీహెచ్ గోవిందరావుకు వినతిపత్రం అందించారు. శాని టేషన్ వర్కర్ల సంఘం నాయకులు కె.భవాని, పద్మ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు ఆరు నెలలుగా వేతనాలు అందలేదని, దీంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణం తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మి, వెంకటమ్మ, శాంతి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు

పాతపట్నం డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీతో మెరుగైన ఫలితాలు వస్తాయని ఫిజియోథెరపిస్టు ఎస్.ఈశ్వరరావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో సోమవారం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి 19 మంది విద్యార్థులు ఫిజియోథెరపీ చేయించుకునేదుకు వచ్చారన్నారు. ఇంకా ఎవరైన ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్ల లుంటే ప్రతి సోమవారం నిర్వహించే ఫిజియోథెరపీకి తీసుకురావాలని కోరారు. ఐఈఆర్‌టీలు పి.సుధారాణి, ఎస్.ఇన్నా, సీజీవీఎస్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం

టెక్కలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు గ్రామాల్లోని పలు విష్ణు ఆలయాల్లో సోమవారం ఉదయం ధనుర్మాస పూజలు ప్రారంభించారు. స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకుడు సీహెచ్ రమణాచార్యులు ఆధ్వర్యంలో నెలగంటు పూజలు చేశారు. తొలిరోజు తిరుప్పావై పాసుర విన్నపం చేశారు. నెలరోజుల పాటు ఒక్కో పాశురాన్ని విన్నవించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక పూజల్లో పలువురు భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతి చెందిన శ్రీనివాసరావు

ఉలవ పాడు, డిసెం బరు 16 (ఆంధ్రజ్యోతి): కరేడు పంచాయతీ పరిధిలోని బట్టియ సోమయ్య పాలెం గ్రామ సముద్ర తీర ప్రాంతంలో సోమవారం విద్యుదాఘాతంతో సంధ్య హేచరీ నడుపుతున్న శ్రీకాకుళం జిల్లా బత్తిలి గ్రామానికి చెందిన కొంపల శ్రీనివాసరావు (45) మరణించాడు. హేచరీకి నీటి సరఫరా కోసం మోటార్లు స్విచ్ ఆన్ చేసేందుకు సముద్రం ఒడ్డున నిర్మించిన మోటార్ల షెడ్ వద్దకు వెళ్లాడు. ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో తోటి పనివాళ్లు వెళ్లి చూడగా శ్రీనివాసరావు విగత జీవుడై ఉండటాన్ని గమనించి ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ఆయన విద్యుదా ఘాతంతో మరణించినట్లు వైద్యులు నిర్ధారిం చారు. ఈ మేరకు ఎస్‌ఐ అంకమ్మ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇల్లు లేని అర్హులను గుర్తించాలి


హౌసింగ్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట/పోలాకి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సొంత ఇల్లు లేని నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. సోమవారం గృహనిర్మాణశాఖ అధికారులతో తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే పేదల సొంత ఇంటి కలను నేరవేర్చేందుకు చేపడుతున్న సర్వేలో లబ్ధిదారులను గుర్తించాలన్నారు. స్థలాలు లేని వారిని, స్థలాలున్నా ఇంటి కోసం దరఖాస్తు చేసిన వారి వివరాలు సేకరించాలన్నారు. ఇల్లు కావాల్సిన వారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హౌసింగ్ డీఈఈ కె.అప్పారావు, ఏఈ శ్రీకాంత్, చల్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సాగు నీరందించేలా కృషి చేయాలి

పోలాకి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్‌కు రైతులకు సాగునీరందేలా సాగునీటి సంఘాల సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. సోమవారం మబుగాంలోని క్యాంపు కార్యాలయంలో పలువురు సంఘ అధ్యక్షులు, సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఎన్నికల్లో టీడీపీ మద్దతు అభ్యర్థులు ఆరుస్థానాల్లో ఏకగ్రీవంగా విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పలు నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి


విజేతలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

మెళియాపుట్టి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులకు ఉపయోగ పడే పనులు చేపట్టా లని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధ్యక్షులుగా ఎన్నికైన వారిని సోమవారం ఆయన అభినందించారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం సాగునీటి చెరువుల్లో పనులు చేయకుండా వదిలేయడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నా రన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సాగు నీరందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. అలాగే సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించిందన్నారు. ఈ సందర్భంగా మెళియాపుట్టి సంఘం అధ్యక్షురాలు అనపాన రాజరత్నం తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజశేఖర రెడ్డి, చక్రి, చంద్రశేఖర్, బి.భాస్కరరావు, రవీంద్రనాథ్ జెన్నా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎంపీడీవో

నందిగాం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నందిగాం మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో టి.రాజారావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కుప్పిలి సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా వై.జ్యోత్స్నాదేవి, కె.రమణబాబు, గౌరవాధ్యక్షురాలిగా లక్ష్మణరేఖ, సాధారణ కార్యదర్శిగా ఇ.లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శిగా ఎ.ఉమాపతి, కోశాధికారిగా కె.గోపీనాథరావు ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా బి.పద్మనాభం, బి.స్వరూప్, ఎ.ధర్మారావు, సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్.ఫాల్గుణరావు ఎన్నికయ్యారు. వీరిని ఎంపీడీవో అభినందించారు.

డిజిటల్ అసిస్టెంట్స్ యూనియన్..

టెక్కలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్స్ యూనియన్‌ను సోమవారం రాత్రి టెక్కలిలో ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా మెట్ట దశరథ, ఉపాధ్యక్షులుగా కొమ్ము కిశోర్, కోశాధికారిగా బగాది జీవన్‌లను ఎన్నుకున్నారు.

సమస్యలు పరిష్కరించండి


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రైస్‌మిల్లుల కార్మికులు

పలాసరూరల్,డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మందస రైస్‌మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్య లను పరిష్కరించాలని చైతన్య రైస్, ఆయిల్ మిల్లు వర్కర్ల యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో గ్రంధి వెంకటేష్‌ను కలిసి వినతి పత్రం అందించారు. మందసతో పాటు చుట్టుపక్కల ఉన్న రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి రెండేళ్లకు ఒకసారి వేతన ఒప్పందం జరుగుతుందని, అయితే గడువు పూర్తయి ఆరు నెలలైనా మిల్లర్లు వేత నాలను పెంచలేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మిల్లు కార్మికుల నాయకులు బి.వెంకటేశం, పి.కూర్మారావు, బి.మల్లేసు, సీఐటీయూ నాయకుడు గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న డాక్టర్ జయలక్ష్మి

హరిపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు విద్యతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని స్త్రీవైద్య నిపుణురాలు జయలక్ష్మి అన్నారు. కుంటికోట నారాయణ హై స్కూల్‌లో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. పరీక్షల సమయంలో ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని, ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రోహిణీ శంకర్, డైరెక్టర్ బుద్ధ సూర్య, అరవింద్ నారాయణ్ పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

కంచిలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నువాగడ కాలనీ వద్ద అక్రమంగా ఒడి శాలోని జలంధర గుమాంగో నుంచి తరలిస్తున్న 20లీటర్ల సారా పట్టుకొని సీజ్ చేశామని ఎస్‌ఐ పారినాయుడు తెలిపారు. సోమవారం రాత్రి వాహనాల తనిఖీ చేపడుతుండగా నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన చెప్పారు.

న్యూస్ బాక్స్

ఎస్‌ఏ-1 పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి

నరసన్నపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే ఎస్‌ఏ-1 పరీక్షల్లో ప్రశ్నపత్రాలు లీకేజీ అవుతున్నాయని, పరీక్షలపై నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం హెచ్‌ఎంలు, ఎంఈవోలతో వెబ్‌ఎక్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. పరీక్షలంటే చులకనగా చూడవద్దని, పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రశ్నపత్రాలను పోలీసు స్టేషన్‌లో భద్రపరిచి పరీక్షకు గంటముందు హెచ్‌ఎంలకు అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడు, పలు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన కలిగిఉండాలి

కోటబొమ్మాళి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బ్యాంకులు అందిస్తున్న వివిధ రకాల సేవలపై అవ గాహన కలిగి ఉండాలని ఏపీజీవీబీ మేనేజర్ సీహెచ్ అనిల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా కొత్తపేటలోని జర్జంగి వికాస్ గ్రామీణ బ్యాంకులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు పనితీరు, అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది బి.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ టి.సంతోషి, అధ్యాపకులు పి.రాజ సురేష్, డి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డీటీ నారాయణరావు బదిలీ

సంతబొమ్మాళి, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ తహసీల్దార్ నారాయణరావును కొత్తూరుకి బదిలీ చేస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారని తహసీల్దార్ రమేష్‌కుమార్ తెలిపారు. ఆయన స్థానంలో మండలంలో భూసర్వే డీటీగా పనిచేస్తున్న హరిని ఇన్‌చార్జిగా నియ మించారన్నారు.

పిట్టవానిపేటలో పాస్టర్స్ ఫెలోషిప్ వేడుకలు

సంతబొమ్మాళి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పిట్టవానిపేటలో టెక్కలి నియోజకవర్గ పాస్టర్స్ ఫెలో షిప్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు క్రీస్తు పుట్టుక, ఆయన బోధనలను వివరించారు. పలువురు పాస్టర్లు, వారి కుటుంబాలకు బ్యాగులు, వస్త్రాలు, క్యాలెండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ ఉర్జాన నారాయణరావు, భక్తవత్సలం, పాస్టర్ కణితి అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

కందిరీగల దాడిలో పలువురికి గాయాలు

కోటబొమ్మాళి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి పంచాయతీ బంజీరుపేట గ్రామంలో సోమవారం కందిరీగలు దాడి చేశారు. పలువురు రైతులు వ్యవసాయ పనుల కోసం వెళ్లి తిరిగి సాయంత్రం ఇళ్లకు వస్తుండగా గ్రామ సమీపంలోని తోట వద్ద కందిరీగలు దాడి చేశాయి. వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. రెండు రోజుల కిందట తోటకు వెళ్లిన గొరైల కాపర్లపై కందిరీగలు దాడి చేశాయని, సోమవారం కూడా పొలం పనులు ముగించుకుని వస్తున్న రైతులపై దాడిచేసి గాయపరిచా యని గ్రామానికి చెందిన రైతు శిమ్మ తవిటిరాజు తెలిపారు.

కాలనీలో మౌలిక వసతులు కల్పించండి

నరసన్నపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జమ్ము పంచాయతీ గడ్డెయ్యపేట వద్ద గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీకి చెందిన యువకులు సోమవారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. పీఎంఏవై కింద ఇళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినా కాలనీల్లో వీధి దీపాలు, రోడ్లు, కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

సంస్మరణ సభను విజయవంతం చేయండి

హరిపురం, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళ పోరాట యోధుడు, విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి సంస్మరణ సభ ఈనెల 22న రట్టి గ్రామంలో నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయా లని సీపీఐఎంల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. హరిపురం మార్పు ట్రస్ట్ భవనంలో సోమవారం సమావేశం నిర్వహించారు. కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జుత్తు వీరాస్వామి, మామిడి భీమారావు, వంకల పాపయ్య భార్గవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

కాశీబుగ్గ, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ 21వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం చైర్మన్ బల్ల గిరిబాబు, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, లొడగల కామేశ్వరరావు యాదవ్ భూమి పూజ చేశారు. వార్డులోని గాంధీనగర్ రోడ్డు రూ.5లక్షలు, మహరాణిపేట రోడ్డుకు రూ.10 లక్షలు, డాక్టర్ ప్రకాష్ వర్మ వీధిలో రోడ్డుకు రూ.5లక్షల సాధారణ నిధులతో పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ రామారావు, కౌన్సిలర్ పి.ప్రసాద్‌రావు, స్థానిక నేతలు చంద్రరావు, సత్యం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.